


వైభవంగా చక్రస్నానం...మహాపూర్ణాహుతి


ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శనివారం | 28 ఫిబ్రవరి , 2026 | పేజీలు : 06


# రైతులకు తప్పని యూరియా కష్టాలు

## యాప్ బుకింగ్ తెలియక రైతుల పాట్లు

## మోసగిస్తున్న వ్యాపారులు...!?

## బ్లాక్ మార్కెట్‌లో రూ.500 బస్తా అమ్మకం



**రైతులకు యూరియా కష్టాలు తప్పడంలేదు. గత ఖరీఫ్ సీజన్‌లాగే రబీ సీజన్‌లో కూడా అవే కష్టాలు. యూరియా కోసం దుకాణాల వద్ద క్యూలైన్‌లో నిలబడకుండా, పక్కదారి పట్టకుండా ఉండేందుకు ఓ యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. యూరియా అవసరమున్న రైతులు యాప్‌లో బుక్ చేసుకుంటే యూరియాను అందిస్తామని చెప్పినా ఎక్కువ మంది రైతులు నిరక్ష్యరాస్యులు కావడంతో యాప్‌లో బుకింగ్ తెలియక తీవ్ర పాట్లు పడుతున్నారు. ఇదే అదునుగా భావించిన కొంతమంది వ్యాపారులు బస్తా యూరియా ధర రూ.269.50 ఉండగా రూ.500కు అడ్డదారిలో బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు.**

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట జిల్లాలో ఈ రబీ సీజన్‌లో రైతులు 4,85,273 ఎకరాలలో వరి సాగు చేశారు. దీనికి అనుగుణంగా అధికారులు 70వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అంచనా వేశారు. కాగా ప్రస్తుతం 65వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నా రైతులకు మాత్రం క్షేత్రస్థాయిలో యూరియా దొరకని పరిస్థితి. ప్రభుత్వం రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ రబీ సీజన్‌లో ఓ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. యూరియా అవసరమున్న రైతులు ముందుగా బుక్ చేసుకుంటే వారికి అవసరమైన యూరియాను ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కాగా నేటి వరకు 1,13,965 మంది యాప్ ద్వారా 4,06,628 బస్తాల యూరియాను బుక్ చేసుకోగా, ఇప్పటి వరకు 3,78,326 బస్తాల యూరియాను రైతులకు పంపిణీ చేయడం జరిగిందని అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వం యూరియా బుకింగ్ కోసం అందుబాటులోకి తెచ్చిన యాప్ తెలియక రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. యాప్ బుకింగ్‌కు రైతు వద్ద ఖచ్చితంగా యాండ్రాయడ్ ఫోన్ అందుబాటులో ఉండడంతోపాటు వారికి యాప్ డౌన్‌లోడ్ చేసుకొని యూరియాను బుకింగ్ చేసుకునేంత అవగాహన ఉండాలి. రైతుల్లో ఎక్కువ మంది నిరక్ష్యరాస్యులే ఉండడంతో ఏమి తెలియని పరిస్థితి. యూరియా బుకింగ్ కోసం యాండ్రాయడ్ ఫోన్ ఉన్న వారి దగ్గరికి యాప్‌పై అవగాహన కలిగిన వారిని ఆశ్రయించాల్సి వస్తుంది. దీనిపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ముందుగానే అవగాహన కల్పించామని చెబుతున్నా వాస్తవానికి సత్యదూరం.

యాప్‌లో బుక్ చేసుకొని ఆయా దుకాణాల వద్దకు రైతులు యూరియా కోసం ఆయా దుకాణాల వద్దకు వెళ్తుండగా రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని రైతులు మోసం చేస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో మొత్తం 47 వ్యవసాయ పరపతి సంఘాలతోపాటు, 690 ఎరువుల దుకాణాలు ఉండగా వ్యాపారుల అవసరాలకు అనుగుణంగా రైతులకు అవసరమైన యూరియాను అధికారులు అందుబాటులోకి తెచ్చారు. యాప్‌లో యూరియాను బుక్ చేసుకున్న రైతులు 24 గంటలలోపు దుకాణం వద్దకు వెళ్ళి యూరియాను కొనుగోలు చేస్తేనే తప్ప గంట లేటు అయినా వ్యాపారులు యూరియాను ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. యూరియా లోడ్ దిగుమతి అయిన గంటలోపే దుకాణాలలో ఒక్క బస్తా కూడా యూరియా నిల్వ ఉండడంలేదు. ఉదాహరణకు... రైతులు యాప్‌లో 5 బస్తాల యూరియాను బుక్ చేసుకుంటే వ్యాపారులు వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కేవలం మీకు 3 బస్తాలు మాత్రమే కేటాయించబడిందని వారిని బురిడి కొట్టించి మిగతా రెండు బస్తాలు వారు పక్కదారి పట్టిస్తున్నారు. ఇలా పక్కదారి పట్టించిన యూరియా బస్తా అసలు ధర బస్తాకు రూ.269.50 ఉండగా బ్లాక్ మార్కెట్‌లో రూ.500కు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామానికి చెందిన ఓ రైతు తాను సేద్యం చేసిన వరి సాగు యూరియా కొరత కారణంగా తన పంట పొలానికి నష్టం వాటిల్లుతుందని ఎవరి వద్దనైనా యూరియా ఉంటే బస్తాకు రూ.1000లు ఇచ్చి కొనుగోలు చేస్తానని వాట్సప్ గ్రూప్‌లలో పోస్టు చేయడం యూరియా కొరత జిల్లాలో ఎంత తీవ్రంగా ఉందో ఇట్టే అర్థమవుతుంది. ఇదే విషయమై జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డిని వివరణ కోరగా రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని, కొరతంటూ ఏమిలేదని చెప్పడం జరిగింది. రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా యాప్‌లో అవసరమైన యూరియాను బుక్ చేసుకొని కేటాయించిన దుకాణాల వద్ద తీసుకపోవాలని సూచించారు.

# విద్యా రంగానికి కొత్త దిశానిర్దేశం

## నాగార్జున సాగర్ శాసన సభ్యుడు కుందూరు జై వీర్ రెడ్డి

**ప్రజాపక్షం/నిడమనూరు:** ఆధునిక సదుపాయాలతో కూడిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల జిల్లాలో విద్యా రంగానికి కొత్త దిశానిర్దేశం అవుతుందని నాగార్జున సాగర్ శాసన సభ్యులు కుందూరు జై వీర్ రెడ్డి అన్నారు. ఒకే ప్రాంగణంలో స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు,సైన్స్ కంప్యూటర్ ల్యాబ్‌లు, డిజిటల్ లైబ్రరీ,విశాలమైన ప్లేగ్రౌండ్‌లు వంటి సౌకర్యాలతో నిర్మించబడనున్న పాఠశాల నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించాలని అధికారులకు సూచించారు.స్కూల్ కి కావలసిన భూసేకరణ కోసం ఊట్కూరు గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు.శుక్రవార నిడుమనూరు మండలంలోని ఊట్కూరు గ్రామం వద్ద నాగార్జునసాగర్ శాసన సభ్యులు జయ వీర్ రెడ్డితో కలిసి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశారు.జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను చేపట్టడం జరిగిందని అన్నారు.కేజీ నుండి పీజీ వరకు ఒకే ప్రాంగణంలో అన్ని కులాల వారికి సమగ్ర విద్యా సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని,ఈ పాఠశాలలో చిన్నారులు కిండర్ గార్డెన్(కేజీ)లో చేరి పీజీ డిగ్రీ పూర్తయ్యే వరకు నిరంతరాయంగా విద్యను కొనసాగించేలా రూపకల్పన చేశారన్నారు.ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,తహసిల్దార్ కృష్ణయ్య,ఎంపీడీవో హిమబిందు,నిడుమానూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అంకటి సత్యం,గ్రామ సర్పంచ్ వసుమతి,మాజీ సర్పంచ్ నర్సింగ్ విజయ్ తదితరులు ఉన్నారు.





## స్థల దాతకు సన్మానం

**ప్రజాపక్షం/అర్వపల్లి :** మండలంలోని రామన్న గూడెం గ్రామ పంచాయితీ కార్యాలయం నూతన భవనం నిర్మాణం కోసం 4 గుంటల స్థలాన్ని విరాళంగా ఇచ్చిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు మోర ఆనందని గ్రామ సర్పంచ్ కర్నాటి వెంకన్న ఆధ్వర్యంలో శుక్రవారం నూతన భవనంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన భవనంలో ప్రత్యేక పూజలు చేశారు. స్థలదాతను వార్డు సభ్యులు శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లింగంపల్లి రవీందర్, పంచాయితీ కార్యదర్శి సుధాకర్, సీనియర్ నాయకులు అనిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, లక్ష్మి కాంతరెడ్డి పాల్గొన్నారు.

## మార్చి 1న ఎస్‌సి స్టడి సర్కిల్ ప్రవేశపరీక్ష

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లా కేంద్రంలోని టిజిఎస్‌సి స్టడి సర్కిల్‌లో వివిధ రకాల పోటీ పరీక్షలకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మార్చి 1న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి కె దయానంద రాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంట్రన్స్ పరీక్ష స్థానిక ఎస్‌వి డిగ్రీ కళాశాలలో ఉదయం 11.00 నుండి మధ్యాహ్నం 1.00 వరకు జరుగుతుందన్నారు. హాల్ టికెట్లు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లౌడ్ చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నంబర్ 9032451108 లో సంప్రదించాలన్నారు.

## చిన్నారికి ఆశీర్వాదం



**ప్రజాపక్షం/మోతె :** మండలంలోని అన్నారిగూడెం గ్రామ ఉపసర్పంచ్ అర్వపల్లి గణేష్ కూతురు అన్నప్రసన్న కార్యక్రమం నిర్వహించగా కోదాడ శాసనసభ్యులు నల్లమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి, మాజీ జడిపిటిసి పి. పుల్లారావు, రాష్ట్ర కిసాన్ సెల్ కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసూదన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ఇంద్రాల సుప్రజ శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

**ప్రజాపక్షం/నల్లగొండ (తిప్పర్తి ):**పేదవాడి సొంతింటి కలను నిజం చేస్తూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు చేపడుతోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు నామిరెడ్డి వెంకట్రామిరెడ్డి, సర్పంచి నామిరెడ్డి అనురాధ అన్నారు.మండలంలోని జొన్నగడ్డలగూడెం గ్రామంలో ముదిగొండ సైదులు, లింగమ్మ దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ నూతన గృహాన్ని శుక్రవారం వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి పాసుదేవ్, వార్డు సభ్యులు చెన్నగొని దేవయ్య,వీరబోయిన రమేష్, ముదిగొండ నీలమ్మ పాల్గొన్నారు.



## విద్యార్థులకు పరీక్షా సామాగ్రి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: వచ్చే నెల 14న జరిగే పదవ తరగతి పరీక్షల దృష్ట్యా గ్రామ యువకుడు నారాబత్తుల ఉదయ్ తన తండ్రి జనార్ధనచారి జ్ఞాపకార్థంగా జప్తివీరప్పగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న పదవ తరగతి విద్యార్థులకు శుక్రవారం పరీక్షా సామాగ్రిని పంపిణి చేశారు. అదేవిధంగా ప్రధానమంత్రి పోషణ్ అభియాన్ భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే విద్యార్థులకు పౌష్టికాహారాన్నిఅందించాలనే లక్ష్యంతో అందించనున్న తిధి భోజన కార్యక్రమాన్ని ఉయద్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బొలిశెట్టి భిక్షపతి మాట్లాడుతూ దాతల సహకారాన్ని వినియోగించుకోని విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. విద్యార్థుల అభివృద్ధికి సహకరించిన నారాబత్తుల ఉదయ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిట్టిబాబునాయక్, మాజీ వైస్ ఎంపీపీ అమరావతి సైదులు, చౌగాని భిక్షం, ఉపాధ్యాయులు గుడిపాటి కోటయ్య, యడవెల్లి దామోదర్‌రెడ్డి, పోరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ధీరావత్ జలరామ్, చంద్రకళ, రేణుక, లక్ష్మయ్య, క్రాంతి, నాగయ్య పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన ఉద్యోగ సంఘాల నాయకులు



**ప్రజాపక్షం/భువనగిరి :** ఉద్యోగ సంఘాల నాయకులు, టిజిటిపి, టిజిఆర్ఎస్‌ఏ, జిపిఓల అసోసియేషన్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లాకు నూతనంగా విచ్చేసిన కలెక్టర్ అనురాగ్ జయంతిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యల్ని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఎల్లప్పుడు ఉద్యోగ సంఘాలకు అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిజిఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షులు బాణాల రాంరెడ్డి, టీజిటిఏ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు రాధా, టిజిఆర్ఎస్‌ఏ జిల్లా అధ్యక్షులు కొండం వెంకట్ రెడ్డి, ముఖ్య నాయకులు లోకేందర్ రెడ్డి, సైదా సాహెబ్, మల్లికార్జునరావు, టిజిటిఏ జిల్లా అధ్యక్షులు పి.రవికుమార్, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## హైదరాబాద్ నుంచి 6 భారత్ గౌరవ్ టూరిస్ట్ రైళ్లు



**మార్చి 21 నుంచి జూన్ 12 వరకు ప్రత్యేక యాత్రలు**

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: తీర్థయాత్రలకు వెళ్లే భక్తుల కోసం ఐఆర్‌సిటిసి ప్రత్యేకంగా భారత్ గౌరవ్ టూరిస్ట్ రైళ్లు నడుపుతోంది.మార్చి 21 నుంచి జూన్ 12 వరకు మొత్తం 6 ప్రత్యేక ప్యాకేజీలను హైదరాబాద్ (సికింద్రాబాద్) నుంచి ప్రారంభిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం అసిస్టెంట్ మేనేజర్ పి.వి.వెంకటేష్ తెలిపారు.నల్లగొండ రైల్వే స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యదక్షిణ యాత్ర, సప్త జ్యోతిర్లింగ దర్శన్, అయోకాశీ, హరిద్వార్‌వైష్ణోదేవి, అరుణాచలంచిదంబరం,బైద్యనాథ్ ధామ్ ప్రత్యేక యాత్రలు ఈప్యాకేజీలలో ఉన్నాయి. సాధారణ, 3ఏసీ, 2ఏసీ తరగతుల్లో టికెట్ ధరలు రూ.14,500 నుంచి రూ.34,600 వరకు ఉంటాయి.రైలు,బస్సు,హోటల్ వసతి,ఉదయం అల్పాహారం, భోజనం, రాత్రి భోజనం, నీటి బాటిల్, టూర్ ఎస్కార్ట్ సేవలు, ప్రయాణ బీమా వంటి అన్ని సౌకర్యాలు ప్యాకేజీలో భాగమని తెలిపారు. ప్రతి కోచ్‌కు సెక్యూరిటీ గార్డ్, సీసీ కెమెరాల భద్రత ఉంటుందని వెల్లడించారు.టికెట్ బుకింగ్ కోసం వెబ్ సైట్ చూడాలని సూచించారు. అదనంగా వేసవి కాలం ప్రత్యేకంగా దేశీయ,అంతర్జాతీయ విమాన ప్యాకేజీలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.

## వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ పోస్టర్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నాగార్జున ప్రభుత్వ కళాశాలలో మార్చి 5న జరగనున్న జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ అంతటి శ్రీనివాసులు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ మారం రమణారెడ్డి హాజరై మాట్లాడుతూ వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ ఛైర్మన్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పార్లమెంటును విజయవంతం చేయాలని అన్నారు. జిల్లాకు నోడల్ కళాశాలగా నాగార్జున ప్రభుత్వ కళాశాల ఎంపిక చేయబడిందన్నారు.18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత మై భారత్ పోర్టల్‌లో మార్చి 4లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాదిఎంపికైన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలకు పంపబడతారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ మునిస్వామి,అకాడమీ కోఆర్డినేటర్ బత్తిని నాగరాజు,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ నర్సింగ్ కోటయ్య,ఎం వెంకటరెడ్డి, డాక్టర్ బొజ్జ అనిల్ కుమార్, కంబాలపల్లి శివరాణి,డాక్టర్ ఏ మల్లేశం, ఎం సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## కఠినంగా శిక్షించాలి

**ప్రజాపక్షం/నకిరేకల్ :** నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర గ్రామంలో మల్లన్న జాతరలో అగ్రకుల అహంకారానికి బలైన చిన్నారి కుటుంబాన్ని ఆదుకోవాలని, చిన్నారి చావుకు కారణమైన 8 మందిని తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం నకిరేకల్ బస్టాండ్ సెంటర్ దగ్గర ప్ల కార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు దిలీప్, సుష్మ,విష్ణు, భరత్, ప్రశాంతి,షాలిని, పద్మ, నవ్య, సోనీ,విజయ, మహేశ్వరీ పాల్గొన్నారు.



## వృద్ధురాలికి అండగా నిలిచిన తహసీల్దార్

### ఇంటి వద్దకే వెళ్లి భూ రిజిస్ట్రేషన్ పూర్తి

**ప్రజాపక్షం/త్రిపురారం:** సేవాభావంతో ముందడుగు వేసిన త్రిపురారం తహసిల్దార్ గాజుల ప్రమీల వృద్ధురాలికి ఇంటి వద్దనే భూ రిజిస్ట్రేషన్ నిర్వహించి ప్రశంసలు అందుకున్నారు. మండల కేంద్రానికి చెందిన 97 ఏళ్ల నెక్కంటి నాగభూషణమ్మ ఆరోగ్య పరిస్థితి కారణంగా కార్యాలయానికి రాలేని స్థితిలో ఉండటంతో శుక్రవారం ఆమె నివాసానికి స్వయంగా వెళ్లి తన పేరు మీద ఉన్న ఐదు గుంటల వ్యవసాయ భూమిని నగిరి చిన్న మల్లయ్య పేరుకు రిజిస్ట్రేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సైదులు, కంప్యూటర్ ఆపరేటర్ అనిల్ పాల్గొన్నారు. తహసిల్దార్ స్పందనపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



**ప్రజాపక్షం/త్రిపురారం:** విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఎంఈఓ రవి నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం మినీ గురుకుల పాఠశాల 26వ వార్షికోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు.విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంృతిక కార్యక్రమాలు సహా అన్ని రంగాల్లో ప్రతిభ కనబరిచి ముందంజలో ఉండాలని సూచించారు. అనంతరం లోకతండ సర్పంచ్ నేనావత్ జ్యోతి కాంతారావు రూ.5వేల విలువైన 50 ప్లేట్లను విద్యార్థులకు పంపిణీ చేసి అభినందనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ భారతి,డాక్టర్ సంజయ్, పంచాయతీ సెక్రటరీ రాజు, సిహెచ్ వెంకయ్య, గోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ భవన నిర్మాణం శంకుస్థాపన



**ప్రజాపక్షం/మర్రిగూడ :**మండలంలోని రామ్ రెడ్డి పల్లి గ్రామపంచాయతీలో అంగన్వాడి భవన నిర్మాణానికి శుక్రవారం సర్పంచ్ లప్పంగి నరసింహ భూమి పూజ చేసి ప్రారంభించారు.సందర్భంగా మాట్లాడుతూ నూతన భవనాన్ని ఉపాధి హామీ పథకం నిధుల నుండి 12 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తారు. అట్లాగే ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పరిరక్షణ కమిటీ సమావేశం జరిగింది. సూపర్వైజర్ యశోద మాట్లాడుతూ బాల్య వివాహాలు,బాలల అక్రమ రవాణా,బాలికల పట్ల వివక్ష, లైంగిక వేధింపులు బాల కార్మికుల నిర్మూలన గురించి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో మాల్ మార్కెట్ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్,ఉప సర్పంచ్ సైదులు, అంగన్వాడీ టీచర్ రంగినేని శారద, పంచాయతీ కార్యదర్శి నజీర, వెన్నమనేని సుధాకర్ రావు మహిళలు,ప్రజలు,పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకులు చేయూత



**ప్రజాపక్షం/త్రిపురారం** :మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన పొదిల మారయ్య మృతి చెందడంతో విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ బైరం లక్ష్మి కృష్ణ మృతదేహానికి నివాళులర్పించి దహన సంస్కారుల నిమిత్తం ఐదు వేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు. అనుముల శ్యాంసుందర్ రెడ్డి,అనుముల శ్రీనివాసరెడ్డి,సుధాకర్ రెడ్డి,కోటిరెడ్డి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## మార్చి 1న ఉచిత మెగా వైద్య శిబిరం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** చందుపట్ల గ్రామ పంచాయతీ,లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ (గెలాక్సీ) సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 1నఆదివారం గ్రామంలో భారీ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆగ్రామ సర్పంచ్ దిగోజు లతా వెంకటాచారి,ఉప సర్పంచ్ ఓర్సు మంజుల శ్రీను శుక్రవారం తెలిపారు.హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ యశోద ఆసుపత్రి(మలక్‌పేట),సూర్యపేట కంటి ఆసుపత్రి నిపుణులైన వైద్యులు ఈ శిబిరంలో పాల్గొంటారని తెలిపారు.

## పెళ్లి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండలం జనంపల్లి గ్రామానికి చెందిన నక్క మల్లయ్య కుమారుడు నవీన్ వివాహం శుక్రవారం జరగగా అట్టి వివాహంకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ ఎంపీటీసీలు వేమవరం సుధీర్ బాబు, దుబ్బాక పావని శ్రీధర్, ఉప సర్పంచ్ చొప్పరి నరసింహ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ప్రజాపాలన హామీల అమలులో మైలు రాళ్ళుగా ఇందిరమ్మ ఇండ్లు నిలుస్తాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇల్లు కార్యక్రమంలో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంద్రియాల గ్రామంలో మొట్టమొదటిసారిగా శుక్రవారం బండి కవిత పెద్ద మల్లేష్ గౌడ్ ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమానికి ఆయనతో పాటు ముఖ్య అతిథులుగా జిల్లా నాయకులు సామ మధుసూదన్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల ఉప అధ్యక్షులు చింతల శ్రీశైలం, గ్రామ శాఖ అధ్యక్షుడు పానుగంటి లింగస్వామి, పవిరాల మహేందర్ పాల్గొన్నారు.

## శంకరయ్య మరణం బాధాకరం

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** గీతా పనివారల సంఘం మండల నాయకులు సుర్వి శంకరయ్య మరణం బాధాకరమని గీత పనివారాల సంఘం జిల్లా కార్యదర్శి పందుల యాదగిరి గౌడ్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని చిమిర్యాల గ్రామానికి చెందిన సుర్వి శంకరయ్య అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబాన్ని గీత పనివారల సంఘం నాయకులు పరామర్శించి ఆయన పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మొగుదాల సత్తయ్య గౌడ్, సుర్వి ముత్యాలు, సుర్వి రాములు, మొగుదాల యాదయ్య పాల్గొన్నారు.



## జెఎస్ఆర్ గ్రాండ్ హోటల్ ఘన ప్రారంభం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నూతనంగా ఏర్పాటు చేసిన జెఎస్ఆర్ గ్రాండ్ హోటల్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను పట్టణ ప్రజలు శుభకార్యాలకు సద్వినియోగం చేసుకోవాలని బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి కోరారు. నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల 8వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన ఈ హోటల్‌ను మేయర్‌తో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అస్రఫ్ అలీ, ఆ డివిజన్ కార్పొరేటర్ వజ్జ రమేష్ యాదవ్‌లు కలిసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన ఫుడ్ ఐటమ్స్ అందించి విశ్వాసాన్ని సంపాదించాలని హోటల్ నిర్వాహకులకు సూచించారు. పట్టణంలో వివాహాలు, పుట్టినరోజులు, శుభకార్యాలు నిర్వహించుకునే వారికి ఈ ఫ్యామిలీ రెస్టారెంట్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. హోటల్ నిర్వాహకులు శేఖర్ రెడ్డి మాట్లాడుతూ, జె.ఎస్.ఆర్. గ్రాండ్ హోటల్‌లో అన్ని రకాల నాణ్యమైన వంటకాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో 25వ డివిజన్ కార్పొరేటర్ వంగూరి నవ్య శ్రీ రాఖీ, మాజీ కౌన్సిలర్ జూలకంటి శ్రీనివాస్,దీప నరేందర్ రెడ్డి,రాగుల రామిరెడ్డి, నున్నప రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి కృషి చేస్తా



**ప్రజాపక్షం/మునగాల:** గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని సర్పంచ్ నల్లపాటి ప్రమీల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహిళ శ్రీ శక్తి భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భవనం నిర్మాణం పూర్తయితే మహిళ సంఘాల కార్యాకలాపాలకు ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు. రానున్న రోజుల్లో గ్రామాన్ని సూర్యాపేట జిల్లాలోనే ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు గ్రామంలోని పార్టీలకు అతీతంగా నాయకులు సహయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల జైపాల్‌రెడ్డి, నల్లపాటి శ్రీనివాస్, మార్కెట్ కమిటి డైరెక్టర్ కాసర్ల కోటయ్య, ఉప సర్పంచ్ కాసర్ల వెంకట్, పంచాయతీరాజ్ ఎఇ వసంత, ఎంపివో నరేష్, ఎపివో శైలజ, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ సభ్యులు పాల్గొన్నారు.

## సూర్యాపేట సమగ్రాభివృద్ధే లక్ష్యం



**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట సమగ్రాభివృద్ధే లక్ష్యామని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. మున్సిపాలిటిలో 15వ ఆర్థిక సంఘం నిధులతో నీటి సరఫరాకు సంబంధించిన ఫైల్‌పై ఆమె తొలిసంతకం చేశారు. దీనికి తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి హాజరయ్యారు. వేద పండితుల ఆశీర్వచనాలతో వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో ప్రభుత్వం నుండి నిధులు తీసుకుని వచ్చి సూర్యాపేట మున్సిపాలిటిని అభివృద్ధి చేస్తామని చెప్పారు. దశలవారీగా మున్సిపాలిటిని అభివృద్ధి చేస్తామని, పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరాకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. నిత్యం 48 వార్డులలో ఉన్న సమస్యలు తెలుసుకుంటామని, కౌన్సిలర్‌లతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫిఉల్లా, కమీషనర్ హన్మంతరెడ్డి, ఇఇ కిరణ్, డిఇ సత్యారావు, టిపిఓ సోమయ్య, ఆర్‌వి కళ్యాణి, శానటరి ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్లు గౌసుద్దీన్, ఎస్ఎస్ఆర్ ప్రసాద్, యాదగిరి, మెప్మా ఇంచార్జి శ్వేత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## పేదల ఇండ్లు కూల్చడం దుర్మార్గమైన చర్య



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** పేదలకు ఇల్లు కట్టిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఆధీనంలో ఉన్న ఇండ్లను కూల్చడం దుర్మార్గమైన చర్య అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో జరిగిన పార్టీ జిల్లా కమిటి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఖమ్మం జిల్లాలోని వెలుగుమట్లలో గత పది సంవత్సరాలుగా భూదాన్ భూముల్లో ఇండ్లు నిర్మించుకొని జీవిస్తున్న పేదలపై రెవెన్యూ యంత్రాంగం, పోలీసు బలగాలు దాడి చేసి పేదల ఇండ్లను కూల్చడం దుర్మార్గమైన చర్య అన్నారు. పేదల ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం వైఖరి మారకపోతే రాష్ట్ర ప్రభుత్వ పీటలు ప్రజలు కదిలించడం ఖాయమన్నారు. కూల్చిన ఇండ్ల స్థానంలో పేదలకు ఇండ్లకు పట్టాలు ఇచ్చి, ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగారపు పాండు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు మల్లు లక్ష్మి, నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు పాల్గొన్నారు.

## నిందితులను శిక్షించాలి

**ప్రజాపక్షం/నందికొండ:** నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మల్లన్న జాతర సందర్భంగా రజక సామాజిక వర్గానికి చెందిన వారిపై జరిగిన దాడిని ఖండిస్తూ నందికొండ మున్సిపాలిటీ పరిధిలో ఎస్‌సి,ఎస్‌టి,బిసి సంఘాల నాయకులు స్థానిక హిల్ కాలనీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం ముందు శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాడులకు పాల్పడటం రాజ్యాంగ విరుద్ధమని నిరసనకారులు మండిపడ్డారు. ఆకుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## ఇకెవైసిని చేయించుకోవాలి

**ప్రజాపక్షం/అర్వపల్లి :** మండల కేంద్రంలోని గ్యాస్ వినియోగదారులు సబ్సిడీ కోసం తప్పనిసరిగా ఈ కెవైసిని చేయించుకోవాలని హరికృష్ణ ఇండియన్ గ్యాస్ గ్రామీణ వి తారక్ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ గ్యాస్ మొబైల్ యాప్ ద్వారా ఈకెవైసి బయోమెట్రిక్ ఆధార్ ధృవీకరణ చేయించుకోవచ్చని అన్నారు. లేదా అర్వపల్లి ఇండియన్ గ్యాస్ కార్యాలయానికి వచ్చి వినియోగదారులు ఈ కెవైసిని చేయించుకోవచ్చన్నారు. గ్రామాల్లోకి సిలిండర్ డెలవరి చేసే బాయ్ వద్ద ఉండే యాప్ ద్వారా కూడా నిర్వహణ చేసుకోవచ్చని సూచించారు. మార్చి 31 లోపు ఈ కెవైసి చేయించుకుంటేనే సబ్సిడి అందిస్తుందని లేదంటే సబ్సిడీ ప్రభుత్వం నిలిపివేస్తుందన్నారు. గ్యాస్ వినియోగదారులు తప్పకుండా ఈకెవైసిని పూర్తి చేయనివారు చేయించుకోవాలని తెలిపారు.

## వార్డు సభ్యుల పాత్ర కీలకం



**ప్రజాపక్షం మాడుగులపల్లి :** మాట్లాడుతూ వార్డు సభ్యులు తమ విధులు, బాధ్యతలను సక్రమంగా అవగాహన చేసుకున్నప్పుడే గ్రామాలలో అభివృద్ధి వేగవంతం అవుతుందని ఎంపీడీవో వంశీధర్ పేర్కొన్నారు. మాడుగులపల్లి మండలం పరిధిలోని నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులకు నిర్వహిస్తున్న జనరల్ ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం మండల కేంద్రంలోని ఎంఆర్‌పి కార్యాలయంలో రెండో విడత శుక్రవారం విజయవంతంగా ముగిసింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ వికాసంలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని అన్నారు. శిక్షణ ముగింపు సందర్భంగా ఎంపీడీవో వంశీధర్ చేతుల మీదుగా శిక్షణ పొందిన వార్డు సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీవో సంగీత, పంచాయతీ కార్యదర్శులు షకీరా బేఘం,సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

## మల్లేపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** కొండమల్లేపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని సర్పంచ్ పసునూరియుగేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సర్పంచ్ వార్డు సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి స్వగ్రామం అయిన నాగర్ కర్నూల్ జిల్లాలోని కొండారెడ్డిపల్లి గ్రామాన్ని సందర్శించారు. కొండారెడ్డి పల్లిలో జరుగుతున్న అభివృద్ధి పనులను, మౌలిక వసతుల కల్పనను క్షుణ్ణంగా పరిశీలించారు. అధికారులతో కలిసి సమన్వయంగా పనిచేసి కొండమల్లేపల్లిని పూర్తిగా అభివృద్ధి చేస్తానని అన్నారు. ఆయన వెంట వార్డు సభ్యులు ఊరే నరేష్, బిజిలి లింగం, పర్వతం కొండల్, ముచ్చర్ల కరుణాకర్, వస్కుల శ్రీను, అందుగుల శ్రీను తదితరులు ఉన్నారు.

## కోటి నష్టపరిహారం ఇవ్వాలి

**ప్రజాపక్షం/నలగొండ టౌన్:** నాగర్‌కర్నూలు జిల్లా కొమ్మెర గ్రామానికి చెందిన రెండు నెలల పసికందు మౌనికను కిరాతకంగా హత్య చేసిన ఘటనపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మిర్యాల యాదగిరి,జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ లు డిమాండ్ చేశారు.నిందితులను వెంటనే అరెస్ట్ చేసి తీవ్ర శిక్ష విధించాలని గడియారం సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ రాందేవ్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కట్ట హరిబాబు బీసీ సంక్షేమ సంఘం టౌన్ ప్రెసిడెంట్ పుట్టా వెంకన్న ఉన్నారు.

## శ్రీశక్తి భవనం శంకుస్థాపన



**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** గుడిబండ గ్రామంలో నూతనంగా శాంక్షన్ అయిన శ్రీ శక్తి భవనమును గుడిబండ గ్రామ సర్పంచ్ మందుల నాగయ్య అధ్యక్షతన ముగ్గులు పోయించారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాము, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమాటి వరప్రసాద్ రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ ఇర్ల జయసింహా రెడ్డి, నాయకులు ఎర్ల నరసింహారెడ్డి, వార్డు మెంబర్లు వంశీ, ప్రేమచంద్, కాజా నాగశేషుగౌడ్, సుక్రు, నాయకులు పాల్గొన్నారు.



## రోడ్డు పనులను ప్రారంభించాలని మంత్రికి వినతి

**ప్రజాపక్షం/నూతనకల్ :** మండలంలోని వెంకేపల్లి గ్రామం నుండి తొమ్మిది కిలోమీటర్ల వరకు నిలిచిపోయిన రోడ్డు పనులను పునఃప్రారంభించాలని కోరుతూ శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్‌లో మినిస్టర్ ఛాంబర్‌లో తెలంగాణ రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క)కు తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ వినతి పత్రం అందజేసినట్లు తుంగతుర్తి నియోజక వర్గ సేవాదల్ అధ్యక్షులు పాల్వాయి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో భాగంగా రోడ్డు పనులను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని తెలిపారు.

## ఉద్యోగ నోటిఫికేషన్‌లపై శ్వేతపత్రం విడుదల చేయాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో ఉద్యోగ నోటిఫికేషన్‌లపై శ్వేత పత్రం విడుదల చేయాలని నిరుద్యోగులు ఇంద్ర నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం నుండి తెలంగాణ నిరుద్యోగ జెఏసి ఆధ్వర్యంలో నిరుద్యోగులతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం నోటిఫికేషన్‌ల పేరుతో నిరుద్యోగులను మభ్యపెడుతూ అబద్ధపు మాటలను ప్రచారం చేస్తుందని ఆరోపించారు. నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయకుండా జాప్యం చేస్తుందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ (29 సెక్టార్)లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగులు కుమార్, శింభు నాయక్, బిక్కు నాయక్, వెంకటేష్, శంకర్ పాల్గొన్నారు.

## వార్డు సభ్యులకు ముగిసిన శిక్షణ

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** కొండమల్లేపల్లి పట్టణంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఐదు రోజుల పాటు వార్డు సభ్యులకు గ్రామ పంచాయతీ వ్యవస్థ, వార్డు సభ్యులు బాధ్యతలు, ప్రభుత్వ పథకాల పర్యవేక్షణ తదితర అంశాల పై నిర్వహించిన శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంపిడివో స్వర్ణలత మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు గ్రామాలలో సమస్యలు గుర్తించి సమయానికి పరిష్కారం చేస్తూ, అధికారులతో సమన్వయంగా కలిసి పనిచేస్తూ గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అనంతరం వార్డు సభ్యులకు శిక్షణ సర్టిఫికేట్లను అందజేశారు. ఈకార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్లు నవీన్, మధుసూధన్, సేవాలాల్, కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# మైనర్ల డ్రైవింగ్‌పై స్పెషల్ ఫోకస్




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** పట్టణంలో మైనర్ల డ్రైవింగ్‌పై స్పెషల్ ఫోకస్ పెట్టినట్లు ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపారు. అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలలో భాగంగా జిల్లా కేంద్రంలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ రోడ్డు నియమ నిబంధన పట్ల ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామన్నారు. రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలలో భాగంగా మండల పరిధిలో మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు వివరించారు. పిల్లలకు వాహనాలు ఇవ్వడం తల్లిదండ్రులు చేస్తే నేరమని, పిల్లలు రోడ్డు ప్రమాదాలకు గురైనా, కారణమైనా తల్లిదండ్రులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. వాహనాలు ఇస్తే పిల్లల సరదా కాస్త విషాదమవుతుందన్నారు. మైనర్ డ్రైవింగ్ వల్ల రోడ్డు ప్రమాదాలు నమోదు అవుతూ చాలా మంది పిల్లలు మృత్యువాత పడుతున్నారని, వికలాంగులుగా అవుతున్నారని గుర్తు చేశా రు. తల్లిదండ్రులు పిల్లల పట్ల శ్రద్ధగా ఉండాలని ఎట్టి పరిస్థితుల్లో వారికి వాహనాలు ఇవ్వకూడదని కోరారు.

# మున్నూరుకాపు ట్రస్ట్ ఆధ్వర్యంలో కాపు ప్రజాప్రతినిధులకు సన్మానం




**ప్రజాపక్షం/చివ్వెంల :** మున్నూరు కాపు ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం దురాజుపల్లి శ్రీలింగమంతుల స్వామి దేవస్థానం సమీపంలోని ట్రస్ట్ భవన్‌లో ఇటీవల జిల్లా వ్యాప్తంగా గ్రామ సర్పంచ్‌లుగా, మున్సిపల్ కౌన్సిలర్లుగా గెలుపొందిన కాపు ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు ట్రస్ట్ అధ్యక్షులు గాలి శ్రీనివాస్, ట్రస్ట్ ఇసి మెంబర్, సుధాబ్యాంక్ ఎండి పెద్దిరెడ్డి గణేష్, ట్రస్ట్ సభ్యులు, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా మాట్లాడుతూ మున్నూరు కాపులు రాజకీయంగా మరింతగా రాణించాలని కోరారు. రాష్ట్రంలోని ఆయా పార్టీలు జనాభా ధామాషా ప్రకారం ఎన్నికల్లో టిక్కెట్లు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కుల సాధన కోసం అందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జిల్లావ్యాప్తంగా ఆయా గ్రామాల్లో నూతనంగా ప్రజల చేత ఎన్నికైన గ్రామ సర్పంచ్‌లు ఆయా మున్సిపాలిటిలలో గెలుపొందిన కౌన్సిల్ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి మున్సిపాలిటిలతోపాటు జిల్లాలోని ఆయా గ్రామాలలో గెలుపొందిన కాపు ప్రజాప్రతినిధులకు పూలమాలలు, శాలువాలు కప్పి మెమోంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మిర్యాల కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు నల్లగుంట్ల అయోధ్య, జాయింట్ సెక్రటరీ ఉప్పు శ్రీనివాసరావు, సభ్యులు దేగల కృష్ణ, సంఘాని రజనీకాంత్, తోట నర్సయ్య, మట్టపల్లి రాధాకృష్ణ, గాలి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఎంపిడిఒకు వినతి



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం కేంద్రంలోని స్థానిక ఎంపిడివో కార్యాలయం ముందు శుక్రవారం మండల బిఆర్ఎస్ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఎంపిడివో చంఢీరాణికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా మాజీ జిల్లా వైస్ చైర్మన్ గడ్డ మీది పాండరి, మందడి రామకృష్ణారెడ్డిలు మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీకి కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన ఎన్ఆర్‌జిఎస్ నిధులు కేవలం కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్‌లు ఉన్న గ్రామ పంచాయతీలకు మాత్రమే కేటాయిస్తున్నారని, స్థానిక ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య సహకారంతో వారికి సంబంధించిన సర్పంచ్‌లకు మాత్రమే నిధులు కేటాయిస్తూ ఉండడం సరికాదని అన్ని గ్రామాలలో సమానంగా నిధులను కేటాయించి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని వారు అన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్‌లు లిల్లి గణేష్, మహోదయ్, అనిత శ్రీనివాస్‌రెడ్డి, ఆలకుంట్ల సుధాకర్ పాల్గొన్నారు.

## గ్రామాలను ఆదర్శవంతంగా అభివృద్ధి చేయాలి

**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ వార్డు సభ్యుల రెండవ విడత శిక్షణ శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వై.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలను ఆదర్శవంతంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని ఎంపీడీవో వై.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన 13 గ్రామాల వార్డు సభ్యుల శిక్షణ పూర్తి చేసి వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రచారం చేస్తూ పంచాయతీ విధులు సక్రమంగా నిర్వహించాలని ఆయన కోరారు.




## మంత్రి సీతక్కను కలిసిన బాలచందర్

**ప్రజాపక్షం/బీబీనగర్ :** తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను శుక్రవారం హైదరాబాద్ ఆమె నివాసంలో సేవాదళ్ జాతీయ కార్యవర్గ సభ్యులు బుర్రి బాలచందర్ మర్యాదపూర్వక వికాల్సి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మార్చి 2 తారీఖున తన కుటుంబంలో జరిగే జన్మదిన వేడుకలకు హాజరుకావాలని ఆహ్వానించారు. అదేవిధంగా శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డిని హైదరాబాద్ ఆయన నివాసంలో కలిసి జన్మదిన వేడుకలకు హాజరుకావాలని ఆహ్వానించి ఎమ్మెల్యేను శాలువా పూలమాలతో సన్మానించారు.





## స్వపరిపాలన దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/మునగాల:** మండల పరిధిలోని ముకుందాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, రాజకీయ, పలు శాఖల అధికారుల వేషాదారణలతో అలరించి, తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ వేడుకలను గ్రామ సర్పంచ్ కొల్లాపూరి రాములమ్మ, మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు, కాంప్లెక్స్ హెడ్మాష్టర్ మైనం శోభన్‌బాబు, పిహెచ్‌సి డాక్టర్ పూజమాధురి లు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తూరి బిక్షం, ఉపాధ్యాయులు శ్రీరాం నాగార్జున, వీరస్వామి, జి.వెంకటేశ్వర్లు, సిఆర్‌పి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి




**ప్రజాపక్షం/దేవరకొండ;** వాహనదారులందరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించి ప్రయాణికులను ప్రమాదాలు జరగకుండా గమ్యం చేర్చాలని దేవరకొండ సిఐ వెంకట్‌రెడ్డి వాహనదారులకు సూచించారు. పోలీసు శాఖ, దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సురక్షిత ప్రయాణం పై శుక్రవారం అవగాహన కార్యక్రమం పట్టణంలోని ఆటో డ్రైవర్లు, స్కూల్ వ్యాన్ డ్రైవర్లతో నిర్వహించారు. స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్‌విటి మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని, డ్రైవింగ్‌లో నిర్లక్ష్యం పనికిరాదని అన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ సాలకమ్మ, రాజకుమార్‌రెడ్డి, రామకృష్ణ, జంగయ్య, అన్వర్, శ్రీధర్, భాస్కర్, రాము, డ్రైవర్లు పాల్గొన్నారు.

## సృజనాత్మకంగా ఆలోచించాలి



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించాలని మండల విద్యాధికారి ఆర్. నాగేశ్వర్‌రావు అన్నారు. ఆయన మండల కేంద్రంలోని శ్రీ కృష్ణవేణి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పోను సందర్శించి విద్యార్థులు ప్రదర్శించిన స్టాల్‌లను పరిశీలించారు. ఈకార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కట్ట వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపల్ దామోదర్‌రెడ్డి, ఉపాధ్యాయులు బొమ్మ శ్రీను, పల్లా వెంకట్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 180 మందికి వైద్య పరీక్షలు



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండలంలోని కక్కిరేణి గ్రామంలో రామన్నపేట లయిన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ యశోద ఆసుపత్రి సౌజన్యంతో శుక్రవారం కక్కిరేణి గ్రామంలో వైద్యులు 180 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా లయిన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్స్ గాలయ్య బోయ, కార్యదర్శి డాక్టర్ వనకంటి భాస్కర్ రావు మాట్లాడుతూ క్లబ్బు ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అందులో భాగంగానే కక్కిరేణి గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించామని, 15 మంది యువకులు రక్తదానం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నూల సిద్ధప్ప, సంజీవరెడ్డి, యాపాల కృష్ణారెడ్డి, అనువర్ణా దేవి, గుత్త నరసింహారెడ్డి, బొడ్డు సురేందర్ ఉన్నారు.



## జిల్లా కలెక్టర్‌ను కలిసిన 108, 102 ప్రోగ్రాం మేనేజర్, కోఆర్డినేటర్

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : యాదాద్రి జిల్లాకు నూతనంగా వచ్చిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంత్‌ని 108 సర్వీస్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్చం అందజేశారు. 108, 102 సర్వీస్‌ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో 108 యాదాద్రి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ షేక్ సలీం, 102 యాదాద్రి జిల్లా కోఆర్డినేటర్ ధూపాటి మహేష్ కుమార్, ఎస్.విశ్వం తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధిలో బాగస్వాములవుదాం



**ప్రజాపక్షం/మోటకొండూర్** : ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిలో బాగస్వాములమై బాగుచేసుకోవాలని ప్రముఖ ఎన్ఆర్ఐ చాడ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం మోటకొండూర్ మండలంలోని చాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి కుటుంబ సభ్యులతో కలిసి భూమి పూజ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన తండ్రి చాడ మోహన్ రెడ్డి జ్ఞాపకార్థం సుమారు రూ.40 లక్షల వ్యయంతో నాలుగు అదనపు తరగతి గదులను నిర్మించ తలపెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మోరబాల గంగాధర్ రెడ్డి, మోహన్ రెడ్డి, కూతురు శ్రావణి రెడ్డి, నిశాంత్ రెడ్డి, ఉప సర్పంచ్ పెలిమెల్లి భూమయ్య, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు సన్మానం

**ప్రజాపక్షం/రామన్నపేట** : ఇంద్రపాలనగరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గర్దాస్ విక్రమ్, ఉప సర్పంచ్ నల్ల జయసుధ స్వామిలను ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ మాదిగలు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ మాదిగ మాట్లాడుతూ ఇంద్రపాలనగరం గ్రామ చరిత్రలోనే మొదటిసారిగా మాదిగలకు ఉపసర్పంచ్‌గా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఈర్లపల్లి మల్లయ్య, ఈర్లపల్లి రమేష్, నల్ల ఎల్లేష్, మంటి బిక్షమయ్య, నల్ల భాస్కర్, నల్ల యాదయ్య పాల్గొన్నారు.



## ప్రజలలో పారిశుధ్యంపై అవగాహన పెంచుతాం



**ప్రజాపక్షం/చండూరు** : చండూరు మున్సిపాలిటీలోని రెండవ వార్డు నుండి మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు,వైస్ చైర్మన్ భూతరాజు దశరథలు ప్రారంభించారు.రెండవ వార్డులోని ప్రజలందరిని పలకరిస్తూ, వార్డులో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ త్వరలోనే మున్సిపాలిటీలో సిసి రోడ్లను, డ్రైనేజీల నిర్మాణాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. అప్పటి వరకు రోడ్లపై మురికినీరు నిల్వ వుండకుండ జాగ్రత్తలు పాటించాలని, ఇండ్ల వద్ద గూణలు వేసుకుని, ఇంకుడు గుంత లాగా చేసుకోవాలని తెలిపారు. ఇండ్ల మధ్య పరిసరాలలో పిచ్చి మొక్కలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చెత్తను రోడ్లపై, డ్రైనేజీల్లో వేయవద్దని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ,రెండో వార్డు కౌన్సిలర్ బుషిపాక వాసు,ఏకాలపు ఆంజనేయులు,బోడ విజయ్,రాజు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రం పనుల ప్రారంభంలో ప్రోటోకాల్ ఉల్లంఘన

**పనులను ప్రారంభించిన సర్పంచ్ భర్త ...పాల్గొన్న తహసీల్దార్ మండలవైద్యాధికారి**

**జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్న గ్రామస్తులు**



**ప్రజాపక్షం/చండూర్** : ప్రోటోకాల్ పాటించకుండ హెల్త్ సెంటర్ పనులకు శంకుస్థాపన చేసిన అధికారులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూతరాజు ఆంజనేయులు డిమాండ్ చేశారు.మండలం లోని గుండ్రపల్లి క్లస్టర్ ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణానికి ప్రభుత్వం నుండి 20 లక్షల రూపాయలు మంజూరు అయ్యాయి. ఇట్టి పనులను శుక్రవారం గ్రామ సర్పంచ్ ఉజ్జిని ఉష లేకుండానే సర్పంచ్ భర్త, తహసీల్దార్ రమాకాంత్, మండల వైద్య అధికారి మాస రాజు పోలీస్ పహారలో ప్రారంభించటం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ క్లస్టర్ గ్రామ పరిధిలోని కస్తాల ,ఉడుతలపల్లి, పడమటితాళ్ల సర్పంచులు, గుండ్రపల్లి గ్రామంలో ఉన్న మిగిలిన ప్రజా ప్రతినిధులు గానీ సంబంధిత ఇంజినీరినీరింగ్ అధికారులు గాని, పంచాయతీ సెక్రెటరీ లేకుండ బిఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు అనిల్ రావు తో కలసి శంకుస్థాపన కార్యక్రమంను నిర్వహించారని ఆరోపించారు. ప్రోటోకాల్ పాటించకుండా శంకుస్థాపన చేసిన అధికారుల పై తగు చర్యలు తీసుకోవాలని ఉన్నత అధికారులను డిమాండ్ చేశారు.ప్రోటోకాల్ ఉల్లంఘన పై శనివారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామ ప్రజలు తెలిపారు.

## ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేలా విద్యా కమిషన్ నివేదిక

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : తెలంగాణ విద్యా విధానం 2026 నివేదిక ప్రభుత్వ విద్యా వ్యవస్థ పునాదులను దెబ్బతీసేలా ఉందని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫడరేషన్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు నిమ్మనగోటి జనార్ధన్,తరాల పరమేశ్ యాదవ్‌లు పేర్కొన్నారు.శుక్రవారం పట్టణంలోని టిఆర్‌టిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ విద్యా కమిషన్ సమర్పించిన కమిషన్ ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేలా ఉందని అదేవిధంగా ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కించపరచడమే కాకుండా,విద్యార్థుల విద్యా హక్కును కాలరాసేలా ఉందని ఆరోపించారు.కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి కిలోమీటర్ పరిధిలో ఒక ప్రాథమిక పాఠశాల ఉండాలని అప్పుడే పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్య అందుబాటులో ఉంటుందన్నారు.కానీ,కమిషన్ ప్రతిపాదించిన మూడు గ్రామాలకు ఒక పాఠశాల అనే విధానం గ్రామీణ ప్రాంతాల్లోని పేద పిల్లలను చదువుకు దూరం చేయడమే దీని ఉద్దేశం అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈఉపాధ్యాయ వ్యతిరేక నివేదికను పక్కన పెట్టి ప్రైవేట్ రంగాన్ని నియంత్రించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై దృష్టి సారించాలన్నారు.

## బౌద్ధ శిల్ప సంపదను,సంస్కృతిని కాపాడుకోవాలి



**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్‌కి ఇరువై పులా ఉన్న బౌద్ధ శిల్ప సంపదను,ఆచార్య నాగార్జున కాలం నాటి శిల్ప సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందని ప్రముఖ రచయిత పున్న కృష్ణమూర్తి అన్నారు.నందికొండ మున్సిపాలిటీ నాగార్జునసాగర్ లోని దాసి సుదర్శన్ స్మారక చిత్ర కళానిలయం లో శుక్రవారం ధరణికోట నాగార్జున కొండ శిల్పకళ పై పరిశోదాత్మక పుస్తకం అమరావతి ఆర్ట్ ను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ అమరావతి ఆర్ట్స్(ధరణికోట),నాగార్జున కొండల చారిత్రక ప్రాముఖ్యతని కొనసాగించాలని కోరారు.ఆచార్య నాగార్జున కి సంబంధించిన శిల్పాలు లండన్‌లోని మ్యూజియంలో అమరావతి ఆర్ట్ గ్యాలరీ పేరున వేలాది మందిని ఆకట్టుకుంటున్నాయని,ఇటువంటి శిల్ప సంపదకు నాగార్జునసాగర్ లో గుర్తింపు లేకపోవడం బాధాకర విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అనంతరం మట్టి మనిషి వేలేపల్లి పాండురంగారావు,గ్రంథాలయ ఉద్యమనాయకులు కస్తూరి ప్రభాకర్, ప్రముఖ కార్టూనిస్ట్ నర్సింహా దాసి,సుదర్శన్ స్మారక కళానిలయం చైర్మన్ మోహన్ రాజు,సమత ప్రసాద్,కిరణ్మయి,విష్ణుమూర్తి, బాల ఈశ్వర్,స్వతంత్ర,గురువయ్య,సర్వారెడ్డి,టూరిజం గైడ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## విద్యార్థులపై దాడి హేయమైన చర్య

**ప్రజాపక్షం/దేవరకొండ;** దేశంలోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటిలో విద్యార్థులు, అధ్యాపకులపై జరిగిన అమానుష దాడిని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ యూనివర్సిటి వైస్ చాన్సలర్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం దేవరకొండ ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్,గణేష్, శివ, జైరాం, అరవింద్, ప్రశాంత్, కొండల్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



## తాజ్‌పూర్ గ్రామాభివృద్ధి దిశగా అడుగులు

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** తాజ్ పూర్ గ్రామాభివృద్ధి దిశగా అడుగులు వేయడం జరుగుతుందని బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ అన్నారు. తాజ్పూర్ గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రత, మహిళా సంఘాల అవగాహన కోసం బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సూచిక బోర్డుల ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరికి స్పష్టంగా కనిపించే ప్రదేశాల్లో పచ్చదనం పరిరక్షణ, పరిశుభ్రత, మహిళా సాధికారత, యువత భవిష్యత్ దిశానిర్దేశం వంటి అంశాలపై స్ఫూర్తిదాయక సందేశాలతో ఈ బోర్డులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు, యువకులు, గ్రామ ప్రజలు పాల్గొని ఈ కార్యక్రమానికి మద్దతు తెలిపారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం



**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్** : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకం పేద ప్రజలకు ఎంతో ఆసరాగా ఉంటుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో 30 మంది లబ్ధిదారులకు రూ.33 లక్షల 28 857 రూపాయల కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి త్వరలోనే ప్రభుత్వ కార్యాలయాలు,డబల్ రోడ్డు నిర్మిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో హాలియా మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి,కాంగ్రెస్ జిల్లా నాయకులు గడ్డం సాగర్ రెడ్డి పాల్గొన్నారు.

## అంతర్జాతీయ అవార్డు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని ఫెయిత్ బంజారా ఆశ్రమ నిర్వాహకుడు సోషల్ వర్కర్ ధీరావత్ హన్యానాయక్ అంతర్జాతీయ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గల్ఫ్‌కు చెందిన సామాజిక సంస్థ ప్రపంచ వ్యాప్తంగా సేవలు అందిస్తున్న వారిని గుర్తించి అవార్డులను అందచేస్తుందని, ఈ దఫా తనను ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. విద్య, వైద్య విభాగాల్లో తన సేవలను గుర్తించిన గల్ఫ్ సంస్థ అబుదాబి వేదికగా నిర్వహించిన ప్రధానోత్సవంలో తనకు అవార్డుతోపాటు ప్రశంసా పత్రం అందచేసిందన్నారు. ఈ అవార్డు తన బాధ్యతను పెంచిందని, ఇదే ఉత్సాహంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రమాబాయి, సుధారాణి, శ్రీనివాస్, కరుణాకర్, దుర్గారెడ్డి, పీటర్, జాషువా, అంజయ్య, సందీప్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## రాంసింగ్ కూతురిని పరామర్శ

**ప్రజాపక్షం/దేవరకొండ;** గురువారం దేవరకొండలోని తమ ఇంట్లో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కంట్లో కత్తెర గుచ్చుకోవడంతో శుక్రవారం హైదరాబాద్‌లోని మెడివిజన్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకొని చికిత్స పొందుతున్న మైనంపల్లి సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ కుమార్తె గీతికను దేవరకొండ ఎంఎల్ఏ బాలు నాయక్ ఆసుపత్రికి వెళ్ళి పరామర్శించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.



# తాగునీటి సమస్య రాకుండా ప్రణాళిక



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :వేసవిలో తాగునీటి సమస్య రాకుండా అన్ని శాఖలు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆయన వివిధ అంశాలపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.వైద్య ఆరోగ్య శాఖ ద్వారా చేపట్టిన వంద రోజుల కార్యచరణ ప్రణాళిక అమలులో భాగంగా చేపట్టిన పనులలో పురోగతి తీసుకురావాలన్నారు. రానున్న వేసవిలో మనుషులు, పశువులు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడకుండా మందస్తు కార్యాచరణ ప్రణాళికను తయారు చేయాలని ,స్వచ్చంధ సంస్థల ద్వారా చలివేంద్రాలు ఏర్పాటు చేయించాలని చెప్పారు. మండల ప్రత్యేక అధికారులు వసతి గృహాల తనిఖీ నివేదికను ఎప్పటికప్పుడు సమర్పించాలని చెప్పారు.ప్రభుత్వ ప్రాధామ్య పథకాలకు సంబంధించిన నివేదికలు అప్డేట్ గా ఉండేలా చూసుకోవాలని అన్నారు.కార్యాలయ పనులలో సమయం వృధా కాకుండా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వినియోగించాలని, ఇందుకుగాను జిల్లా అధికారులందరూ కంప్యూటర్ వినియోగం పై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. హాస్టల్లు, తహసిల్ ఆఫీసులు, ఎంపీడీవో కార్యాలయాలు, సంక్షేమ శాఖలు టీ ఫైబర్ ద్వారా ఇంటర్నెట్ సౌకర్యాన్ని వినియోగించుకునేలా చూడాలని, తద్వారా ఉచిత సేవలతోపాటు, పనులు సులభం అయ్యే అవకాశం ఉందన్నారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి,జిల్లా అధికారులు ఉన్నారు.



## రోడ్డు ప్రమాద స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పి

**ప్రజాపక్షం/నల్లగొండ (నార్కట్పల్లి):** పట్టణ పరిధిలోని నల్లగొండ చౌరస్తా జంక్షన్ వద్ద నిన్న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బండల లారీ వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న మెడికల్ షాప్ దుకాణంలోకి దూసుకెళ్లిన ప్రమాద ఘటనపై జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ప్రమాద స్థలాన్ని ప్రత్యక్షంగా సందర్శించి పరిశీలించారు.ప్రమాదానికి దారితీసిన కారణాలను అధికారుల ద్వారా తెలుసుకుని,సీసీ కెమెరా ఫుటేజీలు తదితర అంశాలపై సమగ్ర విచారణ చేయాలని ఆదేశించారు.ఎస్పి ఘటన స్థలంలో ఉన్న రోడ్డు నిర్మాణం,ట్రాఫిక్ నియంత్రణ పరిస్థితులు,హెచ్చరిక బోర్డుల లేమి తదితర అంశాలను పరిశీలించి భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత రోడ్డు సేఫ్టీ అధికారులకు స్పష్టమైన సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా జంక్షన్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం,హెచ్చరిక బోర్డులు పెంచడం,రాత్రి వేళల్లో మెరుగైన లైటింగ్ ఏర్పాటు చేయడం, ట్రాఫిక్ సిబ్బంది పర్యవేక్షణ పెంచడం వంటి చర్యలను తక్షణం అమలు చేయాలని ఆర్ బి అదికారులను ఆదేశించారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.అలాగే వాహనదారులు వేగ నియంత్రణ పాటించాలని, రాత్రి వేళల్లో జాగ్రత్తగా వాహనాలు నడపాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో డిఎస్పి నల్లగొండ శివరాం రెడ్డి,ఎస్ఐ విష్ణు,స్థానిక సర్పంచ్ భరత్ ఇతర పోలీసు అధికారులున్నారు.

## కేజ్రీవాల్‌కు న్యాయస్థానం క్లీన్‌చీట్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు న్యాయం స్థానం క్లీన్ చీట్ ఇచ్చిందని ఆప్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కీర్తి అశోక్ తెలిపారు. శుక్రవారం ఎన్ఎస్పీ క్యాంపులో ఆయన మాట్లాడుతూ అక్రమ లిక్కర్ స్కామ్‌ల పేరుతో తప్పుడు కేసులను నమోదు చేసి అత్యంత ప్రజాధరణ ఉన్న నాయకుడిని రాజకీయాల నుంచి దూరంగా ఉంచాలనుకోవడం సరికాదన్నారు. రాజకీయ లబ్ధి కోసం బీజేపీ పన్నిన కుట్ర భగ్నం అయిందన్నారు. ఆప్ సీనియర్ నాయకులు మహ్మద్ కుత్బుద్దీన్, నాయకులు ప్రవీణ్‌కుమార్, మహేంద్ర ప్రసాద్‌యాదవ్, రవికుమార్ పాల్గొన్నారు.

## చిరు వ్యాపారాలను వెళ్లగొట్టడం దారుణం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : పట్టణంలోని ప్రకాశం బజార్‌లో దీర్ఘకాలంగా వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారులకు ఎటు వంటి ముందస్తు సమా చారం ఇవ్వకుండా డివైడర్లు తొలగించి చిరువ్యాపారస్తులను వెళ్లగొట్టడం దారుణమని మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు.గత వారం ఎటు వంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా డివైడర్లు తొలగించి చిరు వ్యాపారస్తులను అక్కడ నుండి తొలగించిన విషయంలో గత 30 సం వత్సరాలనుండి పండ్ల వ్యాపారం చేసుకుంటున్న షేక్ అమీర్ సాబ్ నిబంధనలకంటే ఎక్కువగా 35 అడుగులు వెనక్కి జరిగి ఉన్న అమీర్ పండ్ల దుకాణాన్ని మున్సిపల్ అధికారులు,పోలీసులు తొలిగిస్తున్న క్రమంలో అడ్డుకోబోయిన అతన్ని నెట్టి వేయడంతో పక్కనే ఉన్న రేకులపై పడి కాలికి తీవ్ర గాయమై ఆస్పత్రిలో చేరారు.శుక్రవారం అమీర్ ఆసుపత్రి నుండి డి శ్చార్జ్ కావడంతో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అమీర్ దగ్గరకు వెళ్లి పరామర్శించారు.ఆయన వెంట బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్,మారగోని గణేష్,రావుల శ్రీని వాస రెడ్డి,జహంగీర్,ఇర్ఫాన్,మహమ్మద్ అఫ్జల్ ఖాన్,పాషా తదితరులు ఉన్నారు.

## విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గత ఐదు సంవత్సరాలుగా పెండింగ్‌లోఉన్న విద్యార్థుల ఫీజు బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ జేఏసీ కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన హైద్రాబాద్ సచివాలయంలో సీఎస్ రామకృష్ణారావును కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తాటికొండ విక్రమ్‌గౌడ్, కనకాల శ్యాంకుర్మ, గొడుగు మహేష్‌యాదవ్, ఈడిగ శ్రీనివాస్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## కంటి చూపు కోల్పోయిన వృద్ధులకు చూపు నివ్వడం మరువలేనిది



**ప్రజాపక్షం/డిండి;** వృద్యాప్యంలో కంటి చూపు కోల్పోయిన వృద్దులకు ఆపరేషన్ల ద్వారా కంటి చూపులు ఇవ్వడం గొప్ప సహకారమని వారి సేవలను ప్రజలు ఎప్పుడు మరువలేరని ఎర్రగుంటపల్లి సర్పంచ్ మల్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం డిండి మండలం ఎర్రగుంటపల్లి గ్రామంలో గత ఎనిమిది రోజులుగా గ్రామానికి చెందిన కీర్తిశేషులు గోలి నర్సింహారెడ్డి, గోలి కిష్టమ్మ జ్ఞాపకార్థం గోలి బుచ్చిరెడ్డి సహకారంతో శంకర నేత్రాలయం హైదరాబాద్ వారి సౌజన్యంతో వృద్దులకు కంటి పొర చికిత్స ఆపరేషన్ కార్యక్రమం కొనసాగుతుంది. గ్రామంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల ఎంతో ఉపయోగకరమని ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. ఈక్యాంపులో 800 మందికి టెస్టులు చేయడం జరిగిందని, 200 మందికి కంటి ఆపరేషన్‌లు చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం మూగజీవాలకు నట్టల నివారణ మందుల పంపిణి చేశారు. ఈసందర్భంగా వెటర్నరీ వైద్యులు డా. రవితో కలిసి మందులు వేశారు. ఈకార్యక్రమంలో గోలి జెన్నారెడ్డి, రాంరెడ్డి, వార్డు సభ్యులు శ్రీకాంత్, కళావతమ్మ,,అలివేలు, ప్రమీల, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ కాంగ్రెస్ నేత హఠాన్మరణం



**ప్రజాపక్షం/హాలియా:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత యువకుడు ఆవుల ఆంజనేయులు శుక్రవారం హఠాన్మరణం చెందారు. అనుముల గ్రామానికి చెందిన ఆవుల ఆంజనేయులు కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తగా గుర్తింపు పొంది ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ గెలుపులో కీలక పాత్ర పోషించారు. శుక్రవారం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఒకసారిగా కుప్పకూలి మృతి చెందినట్లు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తెలిపారు.అనుముల గ్రామంలో ఆంజనేయులు మృతితో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతి పట్ల కాంగ్రెస్ నాయకులు కౌన్సిలర్ పిల్లి చంద్రకళ ఆంజనేయులు,12వ వార్డ్ కౌన్సిలర్ ఎడవెల్లి మేరీ విజయ్‌లు తీవ్ర సంతాపం వ్యక్తం చేసి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## యాదవ ప్లీనరీ సమావేశం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** దక్షిణ భారత యాదవ ప్లీనరీ సమావేశం ఈనెల 28న హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్నట్లు యాదవ హక్కుల పోరాట సమితి మహిళా జిల్లా అధ్యక్షురాలు ఏర్పుల రేణుక యాదవ్ తెలిపారు.శుక్రవారం నకిరేకల్ పట్టణంలో ప్లీనరీ సమావేశం కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుగుడు రవి యాదవ్,రాష్ట్ర నాయకులు జటంగి వెంకట నరసయ్య,నకిరేకల్ నియోజకవర్గం అధ్యక్షుడు తొట్ల నరసింహా యాదవ్ యాదవ సంఘం నాయకులు లింగస్వామి యాదవ్ పాల్గొన్నారు.



## యాదగిరిగుట్టలో వైభవంగా బ్రహ్మోత్సవ సాంస్కృతిక సంబరాలు

### భక్తి సంగీతం, కూచిపూడి నృత్య ప్రదర్శనలతో పులకించిన క్షేత్రం

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట:** శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలులో భాగంగా దేవస్థానం నిర్వహిస్తున్న ధార్మిక, సాహిత్య, సంగీత మహాసభలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై సుమధుర కళాకారుల ప్రదర్శనలు ఆధ్యాత్మిక శోభను సంతరింపజేశాయి.

సుమధుర ఆరట్స్ అకాడమీ వారి భక్తి సంగీతం

హైదరాబాద్కు చెందిన 'సుమధుర ఆరట్స్ అకాడమీ' కళాకారులు ఈరోజు నిర్వహించిన భక్త సంగీత కార్యక్రమం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. స్వామివారి కీర్తనలు, అన్నమయ్య సంకీర్తనలతో వేదిక పరిసరాలు మార్మోగాయి. గాయనీ గాయకుల సుమధుర గాత్రం భక్తి పారవశ్యాన్ని కలిగించింది.

కనువిందు చేసిన కూచిపూడి నృత్యం

అనంతరం 'మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ' వారి ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన అట్టహాసంగా సాగింది. కళాకారులు తమ అభినయం, పదఘట్టనలతో లక్ష్మీ నరసింహుని వైభవాన్ని నృత్య రూపంలో కళ్లకు కట్టారు. శాస్త్రీయ నృత్య రీతులతో సాగిన ఈ ప్రదర్శన తిలకించిన భక్తుల కరతాళ ధ్వనులతో సభా ప్రాంగణం పులకించిపోయింది.ఈ కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, ధార్మిక సలహాదారులు భక్తులు పాల్గొని కళాకారులను అభినందించారు.

